TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...


మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 201   మంగళవారం 25-03-2025   పేజీలు : 06   వేల : 05/-

# టన్నెల్ సహాయక చర్యల ప్రత్యేకాధికారిగా ఐఏఎస్ శివశంకర్

## పనుల పురోగతిపై సమీక్షించిన సీఎం రేవంత్
## గల్లంతైన వారి ఆచూకీకి అత్యంత ప్రాధాన్యతనివ్వాలంటూ ఆదేశాలు



ఎస్ఎల్ బీసీ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తెచ్చేందుకు అవసరమైన సహాయక చర్యలను కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలను నిరంతరం దగ్గరుండి పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటిని ప్రత్యేకాధికారిగా నియమించాలని సీఎస్ ను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీ కమిటీ హాల్ లో ఎస్ఎల్బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదానికి సంబంధించిన కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమీక్షించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల రోజులుగా ప్రమాద స్థలిలో కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిని విపత్తు నిర్వహణ విభాగం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్? కుమార్?, కల్నల్ పరీక్షిత్ మెహ్రా ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర రాష్ట్రాలకు చెందిన వివిధ విభాగాలతో పాటు ప్రైవేటు సంస్థలన్నీ కలిపి 25 ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయని చెప్పారు. మొత్తం 700 మంది సిబ్బంది ఈ ఆపరేషన్ లో నిమగ్నమైనట్లు చెప్పారు. సొరంగంలో కూలిన రాళ్లు, టీబీఎం విడిభాగాలను వెల్డింగ్ చేసి బయటకు తీస్తున్నామని, ఎప్పటికప్పుడు అక్కడ పేరుకున్న మట్టి, రాళ్ల దిబ్బలు, పూడిక, ఊట నీటిని బయటకు తొలిగిస్తున్నామని చెప్పారు. రెస్క్యూ ఆపరేషన్ కళ్లకు కట్టించేలా ప్రమాదం జరిగిన రోజున, ఇప్పుడున్న పరిస్థితుల ఫొటోలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శించారు. ఇన్లెట్ వైపు నుంచి సొరంగంలో 14 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగినందున గాలి, వెలుతురు తక్కువగా ఉండటంతో సహాయక చర్యలు చేపట్టడం సంక్లిష్టంగా సాగుతోందని అధికారులు వివరించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 30 మీటర్లు అత్యంత ప్రమాదకర జోన్ గా గుర్తించినట్లు చెప్పారు. జీఎస్ఐ, ఎన్జీఆర్ఐ శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం అక్కడ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాల్సి ఉంటుందనే అభిప్రాయం వెలిబుచ్చారు. ప్రమాదానికి గురైన కార్మికుల ఆచూకీ కనుక్కునేందుకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ ఆపద సమయంలో చేపట్టాల్సిన అత్యవసర పనులకు కేంద్రం నుంచి అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి 22వ తేదీన ఎస్ఎల్బీసీ సొరంగ ప్రమాదం జరిగింది. ఎనిమిది మంది కార్మికులు ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో గుర్ ప్రీత్ సింగ్ మృతదేహం మార్చి 9వ తేదీన లభ్యమైంది. మిగతా కార్మికులను గుర్తించేందుకు ఆపరేషన్ కొనసాగించాలని, అవసరమైన అన్ని ప్రత్యామ్నాయాలను అనుసరించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎక్స్?పర్ట్ కమిటీ సూచనల మేరకు పనులు కొనసాగించాలని అన్నారు. తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ మిశ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్జీఆర్ఐ, జీఎస్ఐ, సింగరేణి, హైడ్రా, ఫైర్ సర్వీసెస్ ప్రతినిధులు, ఎస్ఎల్బీసీ పనులు చేపడుతున్న కాంట్రాక్టు కంపెనీ ఎండీ పంకజ్ గౌర్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకై ఐక్య కూటమి ఆవిర్భావం..కన్వీనర్ గా దాసు సురేశ్



అవసరమైతే ఢిల్లీ గల్లీల్లో కూడా పోరాటాలకు దిగుతాం. ముక్తకంఠంతో నినదించిన బీసీ సమాజం.. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ ఐక్య కూటమి ఆవిర్భవించింది. బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ను ఐక్య కూటమి కన్వీనర్ గా ఎన్నుకున్నారు. త్వరలో పౌర సమాజంలో కీలకమైన వ్యక్తులతో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి ఐక్య కార్యాచరణతో ముందుకు వెళ్లాలని కూటమి నిర్ణయించింది.బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ అధ్యక్షతన హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి పౌర సమాజంలో కీలకమైన ప్రొఫెసర్లు, విద్యావంతులు, విద్యార్థులు, లాయర్లు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రధాన పార్టీల లోని బీసీ నేతలు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అవసరమైతే ఢిల్లీ గల్లీలో పోరాటం చేస్తామని బీసీ సమాజం ముక్తకంఠంతో నినదించింది. 42 శాతం రిజర్వేషన్ల సాధన ఐక్య కూటమి కన్వీనర్ దాసు సురేష్ మాట్లాడుతూ...బీసీ సమాజం ఓకే వేదికపైకి రావాలసిన అవసరముందన్నారు.రిజర్వేషన్లను సంపూర్ణంగా అమలు చేయడానికి న్యాయ కోవిదులు, రాజకీయ నాయకులతో నిరంతర విస్తృత సమావేశాలు నిర్వహిస్తామన్నారు.రిజర్వేషన్లు అమలయ్యే వరకు రాష్ట్రంలో, కేంద్రంలో పోరాటాలను తీవ్రతరం చేస్తామని చెప్పారు. క్షేత్రస్థాయిలో బీసీల సాధికారత కోసం శ్రమిస్తున్న విద్యార్థి నాయకుల, మహిళా నాయకురాళ్ల, సామాజిక కార్యకర్తల, మేధావుల, న్యాయవాదుల, జర్నలిస్టుల శక్తిని ఏకీకరణ చేసి బలమైన ఉద్యమాన్ని నిర్మింస్తామన్నారు. బీసీలలో అంతర్గత సమన్వయాన్ని పెంచడంతో పాటు దళితులు, మైనారిటీలు, గిరిజనుల సహకారాన్ని సైతం కూడగట్టి బీసీల 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ముందుకు కొనసాగుతామని చెప్పారు. రాజకీయ పార్టీలకు బీసీ ఓట్లపై అనివార్యతను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధాని మోడీకి బీసీలపై ప్రేమ ఉంటే దేశంలో కులగనణ నిర్వహించి బీసీల లెక్కలు తేల్చాలని దాసు సురేష్ డిమాండ్ చేశారు. సంపదను సృష్టించడంలో ముందున్న బీసీలకు సంపదలో సమాన వాటాను కల్పించాలన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు బిల్లు రాష్ట్ర అసెంబ్లీలో పాస్ అయి చట్టభద్దత దిశగా తొలి అడుగు పడిందని, కామారెడ్డి డిక్లరేషన్ ను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. ఇక బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధి నుంచి కేంద్ర%శీ% కోర్టులోకి వెళ్ళిందని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చదానికి కేంద్రం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. బీసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎంపీలు విహెచ్ హనుమంతరావు, రాపోలు ఆనంద భాస్కర్, ఎమ్మెల్సీ లు మధుసూదనా చారి, అద్దంకి దయాకర్, బిజెపి బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బహుజన ముక్తి పార్టీ జాతీయ దాసు రామ్ నాయక్, ప్రముఖ జర్నలిస్టు తెలంగాణ విట్టల్, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహరాజ్ తదితరులు హాజరయ్యారు.

# సీఎంతో గజ్వేల్ కాంగ్రెస్ నాయకుల భేటీ



గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోగల సీఎం నివాసంలో వారు ఆయన్ను కలిసి... అసెంబ్లీకి హాజరుకాని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ శాసనసభా సభ్యత్వాన్ని రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ నేత నర్సారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సిద్ధిపేట నుంచి పాదయాత్రగా వారు హైదరాబాద్ కు చేరుకున్నారు. అనంతరం రాజ్ భవన్ వెళ్లి గవర్నర్ కు వినతిపత్రం సమర్పించారు.

# మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మైనార్టీ డిక్లరేషన్లు వెంటనే అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి మైనార్టీలకు ప్రాతినిధ్యం లేని తొలి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రోజు తెలంగాణలో ఉన్నది త్వరలో మైనార్టీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం నిరసన కార్యక్రమం చేపడతాం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా భారత రాష్ట్ర సమితి కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉపవాసం ఉంటున్న ముస్లిం సోదరులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ప్రార్థనల్లో కూడా ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "మనుషులందరినీ మనుషులుగా, మతాలకతీతంగా చూసిన గొప్ప పాలకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మతాలకతీతంగా అన్ని పండగలకు ప్రభుత్వ కానుకలు అందించింది. గంగా-జమునా తహజీబ్ సంస్కృతిని కొనసాగిస్తూ, సమాజంలో శాంతిని పెంపొందించే సంస్కృతిని నెలకొల్పాము. మైనార్టీ బాలబాలికలకు అత్యుత్తమ విద్య కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశాము. అంతేకాదు, విదేశీ విద్యా అవకాశాలను కల్పించేందుకు మైనార్టీ సోదరులు, సోదరీమణుల కోసం ప్రత్యేక విదేశీ విద్యా పథకాన్ని అమలు చేశాము. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో ఉన్నత విద్యకు అవకాశం కల్పించాము. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలన్నింటికీ మంగళం పాడుతోంది."“దేశంలో ఎక్కడైనా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉంటుంది. కానీ, తెలంగాణ చరిత్రలో తొలిసారిగా మైనార్టీలకు ప్రాతినిధ్యం లేని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రోజు ఇక్కడ ఉంది. ఇది కాంగ్రెస్ తీసుకొచ్చిన కొత్త కల్చర్. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మైనార్టీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ, పథకాలను వెంటనే అమలు చేయాలి. మైనార్టీ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తామన్న హామీతో పాటు, ముస్లిం సోదరులు, సోదరీమణులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలి. అప్పటిదాకా మైనార్టీ సోదరుల తరఫున రాష్ట్ర ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకొస్తాం," అని కేటీఆర్ స్పష్టం చేశారు.“త్వరలోనే మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలు కోసం కేసీఆర్ గారి అనుమతి మేరకు భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడతాము. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీ డిక్లరేషన్లను వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము," అని కేటీఆర్ పేర్కొన్నారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY



# కెనడా ప్రధాని సంచలన నిర్ణయం



కనడా : కెనడా ముందస్తు ఎన్నికలకు వెళ్లనున్నట్లు ప్రధాని మార్క్ కార్నీ సంచలన ప్రకటన చేశారు. ఏప్రిల్ 28న ముందస్తు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధం, విలీన బెదిరింపుల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అధికారి లిబరల్ పార్టీ ఆఫ్ కెనడా, ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కన్జర్వేటివ్ పార్టీ ఆఫ్ కెనడాల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. పార్లమెంట్‌ను రద్దు చేసి ఏప్రిల్ 28న ఎన్నికలు నిర్వహించాలని గవర్నర్ జనరల్‌ను అభ్యర్థించినట్లు కార్నీ తెలిపారు. పొరుగున ఉన్న కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా మారుస్తానని ట్రంప్ పదే పదే హెచ్చరిస్తున్నారు. ఈ బెదిరింపులను దృష్టిలో పెట్టుకుని మార్క్ కార్నీ ఈ ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. ప్రస్తుతం కెనడాలో లిబరల్ పార్టీకి మెజార్టీ ఉన్నా.. బలమైన ప్రభుత్వం ఏర్పాటు దిశగా కార్నీ ఈ నిర్ణయం తీసుకున్నారు. కెనడా ప్రధానిగా జస్టిన్ ట్రూడో వైదొలిగిన తర్వాత.. ప్రధానమంత్రి బాధ్యతలను ఆర్థిక నిపుణుడైన మార్క్ కార్నీ (60) మార్చి 14న బాధ్యతలు చేపట్టారు.

# అమెరికాలో కాల్పులు భారత్‌కు చెందిన తండ్రీ కూతురు మృతి



వర్జీనియా : అమెరికాలోని వర్జీనియాలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో భారత్‌కు చెందిన తండ్రీ, కూతురు చనిపోయారు. వీరిని గుజరాత్‌కు చెందిన ప్రదీప్ పటేల్, ఉర్మిగా గుర్తించారు. ఈ క్రమంలో కాల్పులు జరిపిన నిందితుడు ఫ్రేజర్ దేవన్ వార్టన్ (44)ను అదుపులోకి తీసుకున్నట్టు వర్జీనియా పోలీసులు తెలిపారు. ప్రదీప్ పటేల్, ఆయన కూతురు ఉర్మి.. గురువారం వర్జీనియాలోని అకోమాక్ కౌంటీలో డిపార్ట్‌మెంటల్ స్టోర్‌కి వెళ్లారు. వారు స్టోర్‌లో ఉన్న సమయంలో నిందితుడు ఫ్రేజర్ దేవన్ వార్టన్ అక్కడికి వెళ్లాడు. తనకు మందు కావాలని అడగడంతో స్టోర్ సిబ్బందికి, అతడికి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం, స్టోర్‌లో ఉన్న వర్కర్లపై నిందితుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ప్రదీప్ కుమార్ ఘటనా స్థలంలోనే మరణించగా, ఉర్మి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. అనంతరం, కాల్పులు జరిపిన ఫ్రేజర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణలో పురోగతి



ఇంఫాల్ : మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణ ప్రక్రియలో పురోగతి సాధించినట్లు, మరింత ముందుకు సాగవలసిన అవసరం ఉన్నట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఆదివారం చెప్పారు. మణిపూర్ హైకోర్టు 12వ వార్షికోత్సవం సందర్భంగా ఇంఫాల్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమం అనంతరం మేఘ్వాల్ విలేకరులతో మాట్లాడారు. 'ప్రశాంతత పునరుద్ధరణ ప్రక్రియలో మేము పురోగమించాం. ఈ విషయమై మరింత ముందుకు సాగవలసిన అవసరం ఉంది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన అనంతరం ఈ అంశంపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చించి, శాంతి పునరుద్ధరణ ఆవశ్యకత గురించి నొక్కిచెప్పాం. అతిత్వరలో రాష్ట్రంలో తిరిగి శాంతిని నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం నిబద్ధమై ఉంది' అని మంత్రి తెలిపారు. హైకోర్టు వార్షికోత్సవ సభలో కేంద్ర మంత్రి ప్రసంగిస్తూ, 'మణిపూర్‌లో ప్రస్తుత శాంతి పునరుద్ధరణ ప్రక్రియ వేగం పుంజుకోవాలని ప్రార్థిస్తున్నాను. దీని వల్ల రాష్ట్రం పురోగమించి, వికసిత్ భారత్‌కు తోడ్పడగలదు' అని చెప్పారు. రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జస్టిస్ వర్మ నివాసంలో నగదు స్వాధీనం వివాదంపై విలేకరుల ప్రశ్నకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి సమాధానం ఇస్తూ 'సుప్రీం కోర్టు ఆ వ్యవహారాన్ని దర్యాప్తు చేస్తోంది. కమిటీ నివేదిక రానివ్వండి ఆ తరువాత మాట్లాడతాం' అని చెప్పారు. జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తుల ప్రతినిధివర్గం మణిపూర్‌లో రెండు రోజుల పర్యటనలో ఉన్నది. శనివారం వారు సహాయ శిబిరాలను సందర్శించి, అంతర్గత నిర్వాసితులతో సంభాషించారు. ఆ ప్రతినిధివర్గం చురాచంద్‌పూర్ జిల్లా లమ్కాలో మినీ సెక్రటేరియట్‌లో న్యాయ సేవల శిబిరాన్ని, వైద్య శిబిరాన్ని, న్యాయ సహాయ క్లినిక్‌ను వర్చువల్‌గా ప్రారంభించింది. మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణకు సంఘటితంగా కృషి చేయవలసిందిగా ప్రజలకు జస్టిస్ గవాయ్ విజ్ఞప్తి చేశారు. ఈ ఈశాన్య రాష్ట్రంలో 'ప్రస్తుత సంక్లిష్ట దశ' కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ సాయంతో త్వరలోనే పరిసమాప్తం కాగలదనే ఆశాభావాన్ని జస్టిస్ గవాయ్ వ్యక్తం చేశారు.

# ముంబయిలోని నివాస భవనంలో అగ్నిప్రమాదం

ముంబయి: ముంబయిలోని విద్యావిహార్ ప్రాంతంలోని 13 అంతస్తుల నివాస భవనంలో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక సెక్యూరిటీ గార్డు మృతి చెందగా, మరొక వ్యక్తి గాయపడ్డాడని ఒక అధికారులు తెలిపారు. విద్యావిహార్ స్టేషన్ ఎదురుగా ఉన్న నాథని రోడ్‌లో ఉన్న తక్షశిల కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో తెల్లవారుజామున 4.35 గంటలకు మంటలు చెలరేగాయని అగ్నిమాపక అధికారి తెలిపారు. భవనంలోని మొదటి, రెండవ అంతస్తులు మంటల్లో చెలరేగాయని ఆయన తెలిపారు. 15 నుండి 20 మందిని సురక్షితంగా రక్షించినట్లు ఆయన వెల్లడించారు. ఇద్దరు సెక్యూరిటీ గార్డులు గాయపడి రాజవాడి ఆసుపత్రికి తరలించగా, వారిలో ఒకరు ఉదయ్ గంగన్ (43) మరణించినట్లు ప్రకటించారు. మృతుడు 100 శాతం కాలిన గాయాలతో మరణించాడని అధికారి తెలిపారు. మాతో వ్యక్తి సభాజిత్ యాదవ్ (52) 25 నుండి 30 శాతం కాలిన గాయాలతో బాధపడుతున్నాడని, ఆయన చికిత్స పొందుతున్నాడని ఆయన చెప్పారు. మంటలు ఉదయం 7.33 గంటలకు అదుపులోకి తీసుకువచ్చామని అధికారి తెలిపారు. అగ్నిప్రమాదానికి కారణం ఇంకా తెలియరాలేదు.

# ప్రజల ముందుకు పోప్ ఫ్రాన్సిస్



రోమ్ : ఆసుపత్రిలో చేరిన సుమారు ఆరు వారాల తరువాత పోప్ ఫ్రాన్సిస్ ఆదివారం తొలిసారి ప్రజలకు బహిరంగంగా కనిపించారు. రోమ్‌లోని జెమెల్లి ఆసుపత్రి ప్రధాన ద్వారం బాల్కనీ వద్దకు ఆదివారం ఉదయం చక్రాల కుర్చీలో ఆయన వచ్చారు. 88 ఏళ్ల పోప్ తన కుడిచేతి వేలును పైకెత్తి ఆసుపత్రి ప్రధాన ద్వారం వెలుపల గుమిగూడి ఉన్న ప్రజా సమూహాన్ని అభినందించారు. ఆసుప్రతి నుంచి పోప్‌ను త్వరలో డిశ్చార్జ్ చేస్తామని శనివారం సాయతం ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న పోప్ ఈ ఏడాది ఫిబ్రవరి 14న ఆసుపత్రిలో చేరారు. బ్రోన్కైటిస్ తీవ్రతరం కావడం, రెండు ఊపిరితిత్తుల్లో న్యూమోనియా, పంగల్ శ్వాసకోశ సంక్రమణ వంటి సమస్యలతో పోప్ బాధపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ నెల 11నే పోప్ కోలుకున్నారని, మరికొన్ని రోజులు ఆసుపత్రిలో ఉండాలని వైద్యులు సూచించారు. పోప్‌ను త్వరలో డిశ్చార్జి చేస్తామని చెప్పిన వైద్యులు%ౌ% ఆయన సుమారు రెండు నెలలపాటు విశ్రాంతి తీసుకోవాలని, భారీ ప్రజా సమూహాలను కలవడం మానుకోవాలని తెలిపారు. న్యుమోనియా ఇన్ఫెక్షన్ నయమైనప్పటికీ మందులు కొనసాగించాలని, శ్వాసకోశ, శారీరక ఫిజియోథెరపీని కొనసాగించాలని వైద్యులు సూచించారు.

# వాణిజ్య ఒప్పందాలు వాస్తవం యుఎస్‌తో బిటిఎపై విదేశాంగ మంత్రి జైశంకర్



ముంబయి : వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి భారత ప్రభుత్వం ప్రస్తుతం మూడు ప్రధాన సంప్రదింపుల్లో పాల్గొంటున్నదని, వాటిలో ఒకటి యునైటెడ్ స్టేట్స్‌తో అని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ ముంబయిలో 'బిజినెస్ టుడే మైండ్స్ 2025' సదస్సులో చెప్పారు. 'ప్రపంచ ఆర్థిక వ్యవహారాల సంప్రదింపుల సంగతికి వచ్చినప్పుడు వాణిజ్య ఒప్పందాలు ఎల్లప్పుడూ ప్రధాన స్థానం ఆక్రమిస్తుంటాయి. ఇది ఇప్పుడు మరింతగా ఉన్నది. ఈ వాస్తవాన్ని భారత్ గుర్తించి తీరాలి. ప్రస్తుతం మేము ముఖ్యంగా మూడు ప్రధాన సంప్రంపుల్లో ఉన్నాం యూరోపియన్ యూనియన్ (ఇయు), యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఎలు), యునైటెడ్ స్టేట్స్ (యుఎస్) ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)పై చర్చలు సాగుతున్నాయి. ఈ వారమే మేము న్యూజిలాండ్‌తో కూడా సంప్రదింపులు ప్రారంభించాం.మరి కొన్ని కూడా జరగబోతున్నాయి' అని మంత్రి తెలియజేశారు. ప్రతీకార టారిఫ్‌లు విధిస్తామని యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదరించిన తరువాత భారత్ ప్రయోజనాలకే అగ్ర ప్రాధాన్యం ఇస్తామని కేంద్రం పునరుద్ఘాటించింది. సునిశిత టెక్నాలజీలను భారత్ పొందే విషయంలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుందని జైశంకర్ చెప్పారు. 'భారత్ ప్రథమం' విధానాన్ని తాము అనుసరిస్తామని జైశంకర్ మరొకసారి చెప్పారు. 'వికసిత్ భారత్ లక్షంగా ఈ విషయంలో భారత్ ప్రథమం దృక్పథంతో ముందుకు సాగుతాం. ఈ సంబంధాల్లో ఇప్పటి వరకు అందుకోని సామర్థ్యాలను సాధించే అవకాశం గురించి కూడా ఆలోచనలు ఉంటాయి. ఇంతకు ముందు మా ఎఫ్‌టిఎలలో చాలా వరకు ఆసియా ఆర్థిక వ్యవస్థలతో ఉన్నాయి. వాటిలో అనేకం పోటీ లక్షణంతో ఉన్నాయి. గల్ఫ్, పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలతో సంప్రదింపుల ద్వారా సమతూకం సాధించడం ఆర్థికంగా లాయకీ కావడమే కాకుండా వ్యూహాత్మకం కూడా' అని మంత్రి వివరించారు. పరస్పవర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందానికి వచ్చేందుకు 'వివిధ స్థాయిల్లో' యుఎస్ ప్రభుత్వంతో భారత్‌తో సంప్రదింపులు సాగిస్తూనే ఉంటుందని విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) అధికార ప్రతినిధి రణ్‌ధీర్‌జైశ్వాల్ శుక్రవారం తెలియజేశారు.

# మత ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగం ఉల్లంఘనే



బెంగళూరు: ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలన్న కర్నాటక ప్రభుత్వం నిర్ణయంపై చర్చ సాగుతున్న నేపథ్యంలో మతం ఆధారిత కోటాను రాజ్యాంగం అనుమతించదని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలె ఆదివారం స్పష్టం చేశారు. అటువంటి రిజర్వేషన్లు మన రాజ్యాంగం రూపశిల్పి బిఆర్ అంబేద్కర్‌కు వ్యతిరేకమైనవేనని కూడా ఆయన అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అత్యున్నత విధాన నిర్ణాయక విభాగం అఖిల భారతీయ ప్రతినిధి సభ (ఎబిపిఎస్) సదస్సు ముగింపు రోజు విలేకరులతో హొసబలె మాట్లాడుతూ, 'మతం ఆధారిత రిజర్వేషన్‌ను బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ఆమోదించడం లేదు. ఆ పని చేస్తున్నవారు ఎవరైనా మన రాజ్యాంగం రూపశిల్పికి వ్యతిరేకంగా వెళుతున్నట్లే' అని వ్యాఖ్యానించారు. ముస్లింల కోసం మతం ఆధారిత రిజర్వేషన్లను ప్రవేశపెట్టేందుకు గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర చేసిన యత్నాలను హైకోర్టులు, సుప్రీం కోర్టు తోసిపుచ్చాయని కూడా ఆయన వెల్లడించారు. అటువంటి కోటా కోసం నిబంధనలను కోర్టులు తిరస్కరించాయని హొసబలె స్పష్టం చేశారు. మహారాష్ట్రలో 17వ శతాబ్దపు మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిపై వివాదం గురించిన ప్రశ్నకు హొసబలె సమాధానం ఇస్తూ, ఔరంగజేబును ఒక ఐకన్‌ను చేశారని, సామాజిక సామరస్యంలో విశ్వాసం ఉన్న అతని సోదరుడు దాడా షికోహ్‌ను అలా చేయలేదని చెప్పారు. భారత విలువలకు వ్యతిరేకంగా సాగిన వారిని ఐకన్‌లను చేశారని ఆయన ఆరోపించారు. బ్రిటిష్‌వారిని ప్రతిఘటించినవారిని కాకుండా వారిపై పోరాడినవారిని స్వాతంత్ర్య యోధులుగా పేర్కొన్నారని కూడా ఆయన అన్నారు. మొగల్ చక్రవర్తి అక్బర్‌పై పోరాడినందుకు రాజపుత్రుల రాజు మహారాణా ప్రతాన్ వంటి ప్రముఖులను హొసబలె కొనియాడారు. 'అక్రమణ మనస్తత్వం'తో ఉన్నవారు భారత్‌కు ముప్పు కలిగిస్తున్నారని ఆర్‌ఎస్‌ఎస్ నేత అన్నారు. 'భారతీయ విలువలను మన్నించేవారికి మనం దన్నుగా ఉండాలి' అనిహొసబలె సూచించారు.మరి 25 ఏళ్ల పాటు పార్లమెంటరీ నియోజకవర్గాల స్తంభన చెన్నై : 1971 జనాభా లెక్కల ప్రాతిపదికపై పార్లమెంటరీ నియోజకవర్గాలపై స్తంభనను మరి 25 సంవత్సరాల పాటు కొనసాగించాలని కేంద్రానికి డిఎంకె నాయకత్వంలోని సంయుక్త కార్యాచరణ కమిటీ (జెఎసి) సమావేశం శనివారం విజ్ఞప్తి చేసింది. పార్లమెంట్ సభ్యులు తమ కోర్కెలపై ఒక ఉమ్మడి వినతిపత్రాన్ని ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాల సమయంలోనే ప్రధాని నరేంద్ర మోడీకి సమర్పించాలని జెఎసి సమావేశంలో నిర్ణయించింది. జెఎసి సమావేశంలో ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించారు. 'న్యాయమైన రీతిలో డిలిమిటేషన్' జరిగేలా చూడాలని కోరుతూ డిఎంకె నేతృత్వంలో జెఎసిని ఏర్పాటు చేసిన విషయం విదితమే. ప్రజాస్వామ్య వ్యవస్థ 'ఉద్దేశం, లక్షణం' మెరుగుదలకు కేంద్ర ప్రభుత్వ చేపట్టే ఏ డిలిమిటేషన్ ప్రక్రియనైనా పారదర్శకంగా, అన్ని రాష్ట్రాల రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములు చర్చించి , దోహదం చేసే రీతిలో నిర్వహించాలని తీర్మానం కోరింది. '42వ, 84వ, 87వ రాజ్యాంగ సవరణల వెనుక శాసనవ్యవస్థ ప్రధానోద్దేశం జనాభా నియంత్రణ చర్యలను సమర్థంగా అమలు జరిపిన రాష్ట్రాలను పరిరక్షించడం/ప్రోత్సహించడం అయినందున, జాతీయ జనాభా క్రమబద్ధీకరణ లక్షాన్ని ఇంకా సాధించనందున 1971 జనాభా లెక్కల ప్రాతిపదికపై పార్లమెంటరీ నియోజకవర్గాల స్తంభనను మరి 25 సంవత్సరాలు పొడిగించాలి' అని జెఎసి తన తీర్మానంలో సూచించింది. జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు జరిపిన, తద్వారా జనాభా వాటా తగ్గిన రాష్ట్రాలను శిక్షించరాదని, ఇందు నిమిత్తం కేంద్రం అవసరమైన రాజ్యాంగ సవరణలు చేయాలని జెఎసి కోరింది. ప్రాతినిధ్య రాష్ట్రాల పార్లమెంట్ సభ్యులతో కూడిన కోర్ కమిటీ పైన పేర్కొన్న సూత్రాలకు భిన్నంగా ఏ డిలిమిటేషన్ ప్రక్రియనైనా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేసే ఏ ప్రయత్నాలనైనా తిప్పికొట్టేందుకు పార్లమెంటరీ వ్యూహాలను సమన్వయం చేస్తుంది. ఎంపిల కోర్ కమిటీ పైన ప్రస్తావించిన విధంగా ఉమ్మడి వినతిపత్రాన్ని ప్రస్తుత పార్లమెంటరీ సెషన్‌లో ప్రధానికి అందజేస్తుంది' అని తీర్మానం తెలియజేసింది. సమావేశంలో ప్రాతినిధ్యం ఉన్న వివిధ రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఈ అంశంపై తమ తమ రాష్ట్రాలలో సముచిత శాసనసభ తీర్మానాలు తీసుకువచ్చేందుకు ప్రయత్నించి, కేంద్ర ప్రభుత్వానికి ఆ విషయం నివేదిస్తాయని తీర్మానం తెలిపింది.

# భగత్ సింగ్ నగర్ దోబి ఘాట్ స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలి




**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) మార్చ్ 24 :** కుత్బుల్లాపూర్ చింతల్ సర్వే నెంబర్ 148, చింతల్, భగత్ సింగ్ నగర్‌లో ఉన్న దోబీ ఘాట్ (మొగుళ్ళకుంట) ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్‌ను అక్రమంగా ఆక్రమించుకుని, గత సంవత్సరం నవంబర్ నుండి దాదాపు 2,000 గజాల స్థలంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ నాయకుల సహకారంతో కొనుగోలు /అమ్మకాలు జరగడం, అలాగే రూముల నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ అక్రమ నిర్మాణాలపై గతంలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కావున, ఎఫ్.టి.ఎల్ / బఫర్ జోన్‌లో ఉన్న ఈ అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించి, ఆ ప్రదేశంలో పార్కు ఏర్పాటు చేయాలని కోరుతున్నాము. అదేవిధంగా, జగద్గిరిగుట్ట పైప్‌లైన్ నుండి వచ్చే 30 ఫీట్ల నాలాను పునరుద్ధరించి, అందమైన ప్రదేశంగా పచ్చని చెట్లు నాటాలి అందమైన ప్రదేశంగా తీర్చిదిద్దాలి. ఈ విషయమై చింతల్ కాలనీ ప్రజలతో కలిసి డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ వారంలో చర్యలు తీసుకోకపోతే హైడ్రా కమిషనర్‌కు డిప్యూటీ కమిషనర్‌పై ఫిర్యాదు చేస్తామని అధికారులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో చింతల్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు సదానంద, ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్, మాజీ అధ్యక్షులు పత్తి సతీష్, డివిజన్ అధ్యక్షులు రాజేష్ చారి, జీడిమెట్ల డివిజన్ మాజీ అధ్యక్షులు పులి బలరామ్, జితేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, బిజెవైఎం అసెంబ్లీ కో-కన్వీనర్ శ్యామ్, బిజెవైఎం నాయకులు ఈశ్వర్ రెడ్డి, ఆదిత్య, రామ్ సాయి తదితరులు పాల్గొన్నారు చింతల్ డివిజన్ బీజేపీ నాయకులు, ఆకుల సతీష్ టీం.

# ట్రస్ట్ కేర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం దరువు అంజన్న




**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) మార్చి 24 :** సామాజిక సేవే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ట్రస్ట్ కేర్ ఫౌండేషన్ కుత్బుల్లాపూర్ మండల్ గాజులరామారంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓయూ జేఏసీ నేత కాంగ్రెస్ పార్టీ నాయకులు దరువు అంజన్న మాట్లాడుతూ స్వార్థపూరితమైన నేటి సమాజంలో ఇటువంటి ఫౌండేషన్ ఒకటి ఏర్పాటు చేసి సామాజిక సేవ చేస్తున్న ట్రస్ట్ కేర్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు, చదువుకోవాలన్న కోరిక ఉన్న వారి ఆర్థిక ఇబ్బందుల వల్ల చాలామంది విద్యార్థులు మధ్యలోనే చదువు వదిలేస్తున్నారని, గత తెరాస ప్రభుత్వం సైతం సర్కారు బడులను ప్రోత్సాహం చేయకుండా కార్పొరేట్ విద్య సంస్థలను ప్రోత్సహించడం శోచనీయమన్నారు, ఇప్పుడు ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేద విద్యార్థులకు న్యాయం జరిగేలా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తుందని అన్నారు, ట్రస్ట్ కేర్ ఫౌండేషన్ సభ్యులు ఆంజనేయులు మాట్లాడుతూ ఇలాంటి సేవలు భవిష్యత్తులో ఇంకా చేస్తామని అన్నారు, చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యను కష్టమైన ఇష్టంగా చదవాలని అన్నారు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ ట్రస్ట్ కేర్ ఫౌండేషన్ వారు మా యొక్క విద్యార్థుల ప్రతిభను గుర్తించడం సంతోషం అన్నారు, అమెరికా లో ఉంటున్న గుడిపాటి హరిప్రసాద్ ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు, విద్యలో ముందంజలో రాణిస్తున్న రాధికా, శ్రీజ, ఐశ్వర్యలకు, సైకిళ్ళు పంపిణి చేసారు, ఈ కార్యక్రమం లో ఉపాధ్యయులు రమాదేవి,రాజశేఖర్ ట్రస్ట్ సభ్యులు ఆశలత పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఇప్పించిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్




**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) మార్చ్ 24 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాంధీనగర్ ఇండస్ట్రీ ఏరియాలో "ప్రెస్ టు ఫ్రాం ప్రైవేట్ లిమిటెడ్" లో ఎండి. రహీం అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి పనిచేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రెస్ టు ఫ్రమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మానేయడం జరిగింది... ఎండి రహీం అనే కార్మికుడికి గ్రాడ్యుయేట్ 50,000/- వేల రూపాయలు రావాల్సి ఉండగా అవి ఇవ్వకపో వడంతో పలుమార్లు కంపెనీ ఓనర్ ఎండి సతీష్ ని అడిగి అడిగి విసుగు చెందిన కార్మికుడు తనకు తెలిసిన కార్మికుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ ఓనర్ ఎండి. సతీష్, తో పలుమార్లు చర్చించి కార్మికునికి ఎండి. రహీం కు రావలసిన గ్రాడ్యుయేట్ 50,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది...కార్మికుడు ఎంబి రహీం, మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్ , జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..

# గ్రీవెన్స్ డే బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు





**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) మార్చి 24 :** జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 20 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని, ప్రతి కేసుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# మెట్‌పల్లి సిఐగా బాధ్యతలు చేపట్టిన అనిల్ కుమార్




**మెట్ పల్లి (మన వెలుగు) మార్చి 24 :** మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....శాంతిభద్రతల పరిరక్షణ: మెట్‌పల్లిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రజలు ట్రాఫిక్ నియమా లను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా యువకులు అతివేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్త వహించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరిం చారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని చెప్పారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ప్రజల సహకారంతో మెట్‌పల్లిలో శాంతిభద్రతలను పరిరక్షించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. మెట్‌పల్లి ప్రజలకు అందుబాటులో ఉంటానని, వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని సిఐ అనిల్ కుమార్ తెలిపారు.

# గ్రాడ్యుయేట్ ఇప్పించిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్



**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) మార్చ్ 24 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాంధీనగర్ ఇండస్ట్రీ ఏరియాలో "ప్రెస్ టు ఫ్రాం ప్రైవేట్ లిమిటెడ్" లో ఎండి. రహీం అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి పనిచేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రెస్ టు ఫ్రమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మానేయడం జరిగింది... ఎండి రహీం అనే కార్మికుడికి గ్రాడ్యుయేట్ 50,000/- వేల రూపాయలు రావాల్సి ఉండగా అవి ఇవ్వకపో వడంతో పలుమార్లు కంపెనీ ఓనర్ ఎండి సతీష్ ని అడిగి అడిగి విసుగు చెందిన కార్మికుడు తనకు తెలిసిన కార్మికుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ ఓనర్ ఎండి. సతీష్, తో పలుమార్లు చర్చించి కార్మికునికి ఎండి. రహీం కు రావలసిన గ్రాడ్యుయేట్ 50,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది...కార్మికుడు ఎంబి రహీం, మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్ , జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్ లో ఈదురుగాలులతో వర్షం కూలిన సూచిక బోర్డు



**కొడంగల్ (మన వెలుగు) మార్చ్ 24 :** కొడంగల్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోతగా ఉన్నా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వర్షానికి తోడుగా భారీ గాలులు వీచడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొడంగల్ తో పాటు మద్దూర్,బొంరాస్ పేట, దుద్యాల మండలాల్లో సైతం భారీ వర్షం పడింది. మద్దూర్ మండలం నందిపాడు గ్రామంలో వడగళ్లతో కూడిన భారీ వర్షం. కొత్తపల్లి మండలంలో వడగళ్లతో కూడిన ఓ మోస్తారు వర్షం వడగళ్ల వానలు కురవడంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నరు. కొడంగల్ పట్టణ శివారులోని హైదరాబాద్- బీజాపూర్ 163వ జాతీయ రహదారిపై సోమవారం మధ్యా హ్నం ఈదురు గాలుల బీభత్సనికి నేషనల్ హైవేపై ఉన్న సూచిక బోర్డు కూలిపోయింది. అదృష్టవశత్తు ఎవరికి అపాయం జరగలేదు.రోడ్డుకు అడ్డంగా హోర్డింగ్ పడడంతో హైదరాబాద్, బీజాపూర్,తాండూర్, గుల్బర్గా, ఎంబిఎస్ఆర్ వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు,సంఘటనా స్థలికి చేరుకున్న కొడంగల్ ఎస్ఐ సత్య నారాయణ రాకపోకలను పునరుద్ధరించారు.

# దేవర ఫసల్వాద్ టూ పల్లెర్ల బిటి రోడ్డు ప్రారంభించిన నాయకులు



**కొడంగల్ (మన వెలుగు) మార్చ్ 24 :** సోమవారం దేవర ఫసల్వాడ్ నుంచి పల్లెర్ల వరకు బీటి రోడ్డు పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు. ఈ రోడ్డు వల్ల దేవర ఫసల్వాడ్ నుండి మద్దూర్ వెళ్లి అక్కడి నుండి పల్లెర్ల వెళ్లేవారు. ఇప్పుడు ఈ రోడ్డు వేయడం తో దాదాపు పది కిలోమీటర్స్ ప్రయాణం తగ్గుతుంది. ఈ కార్యక్రమం లో దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బోడి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ మండల్ అధ్యక్షులు వెంకట్ రావు, మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగ్‌పూర్‌లో కర్ఫ్యూ..డిసిపిలు సహా పలువురికి గాయాలు



**నాగ్‌పూర్ :** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో చేపట్టిన నిరసన హింసాకాండకు దారితీయడంతో పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించినట్లు పోలీస్ అధికారులు మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం చెలరేగిన హింసాకాండలో ముగ్గురు డిసిపిలు (డిప్యూటీ కమిషనర్స్ ఆఫ్ పోలీస్) సహా 12 మంది పోలీస్ సిబ్బంది గాయపడ్డారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. హింసాకాండకు సంబంధించి 15 మందిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. కొత్వాలి, గణేష్ పేట్, తహసీల్, లకడ్‌గంజ్, పచ్‌పవోలి, శాంతినగర్, సక్కర్దార, నందన్‌వన్, ఇమాంబాడా, యశోధర నగర్, కపిల్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ విధించినట్లు ప్రకటించారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని ధ్వంసం చేయాలంటూ సోమవారం సాయంత్రం భజరంగ్ దళ్ కార్యకర్తలు చేపట్టిన ఆందోళన హింసకు దారితీసింది. ఒక వర్గానికి చెందిన పవిత్రగ్రంధాన్ని దగ్ధం చేసినట్లు పుకార్లు వ్యాపించడంతో పోలీసులపై రాళ్లు రువ్వారని అధికారులు తెలిపారు. ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హన్సపురి ప్రాంతంలో రాత్రి 10.30 నుండి 11.30 గంటల మధ్య మరో ఘర్షణ జరిగింది. అల్లరిమూకలు పలు వాహనాలను తగులబెట్టారు. ఆ ప్రాంతంలో ఒక నివాసాన్ని, క్లినిక్‌ను కూడా ధ్వంసం చేశారు.

## వక్ఫ్ బిల్లుపై తప్పుదారి పట్టిస్తున్నారు



**న్యూఢిల్లీ :** వక్ఫ్ చట్టానికి ప్రతిపాదిత సవరణలపై ముస్లింలను ప్రతిపక్షాలు 'తప్పుదారి పట్టిస్తున్నాయి' అని బిజెపి సోమవారం ఆరోపించింది. బిల్లు పార్లమెంట్ ఆమోదముద్ర పొందినట్లయితే స్పష్టమైన టైటిళ్లు ఉన్న వక్ఫ్ ఆస్తుల్లో 'ఒక్క అంగుళమైనా' పరాధీనం కాదని బిజెపి స్పష్టం చేసింది. అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్‌బి) సారథ్యంలో పలు ముస్లిం సంస్థలు ఢిల్లీలో వక్ఫ్ (సవరణ) బిల్లుపై నిరసన ధర్నాలో పాల్గొన్న నేపథ్యంలో బిజెపి ఆ ఆరోపణ చేసింది. పలువురు ఎంపిలు ధర్నాలో పాల్గొన్నారు. బిల్లుకు మద్దతు ఇచ్చిన పక్షంలో ముస్లింలు ఎన్నటికీ క్షమించబోరని ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు టిడిపి. జెడి (యు), ఎల్‌జెపి(రామ్‌విలాస్)లను ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ హెచ్చరించారు. ఆ ధర్నాపై వ్యాఖ్యానించవలసిందని మీడియా కోరినప్పుడు బిజెపి ఎంపి తేజస్వి సూర్య స్పందిస్తూ, 'దేశంలో వోటు బ్యాంకు రాజకీయాలు భయం ఆధారంగానే ఎల్లప్పుడూ సాగుతున్నాయి. సెక్యులర్ పార్టీలుగా చెప్పుకుంటున్నవి అనుసరించే పద్ధతే అది' అని అన్నారు. 'వక్ఫ్ ఆస్తుల యాజమాన్యంలో ప్రొఫెషనలిజాన్ని, మేలైన నిర్వహణను, పారదర్శకతను తీసుకురావడమే వక్ఫ్ బిల్లును తేవడంలో ప్రభుత్వ ఉద్దేశం అని ప్రతి ఒక్కరికీ హామీ ఇస్తున్నాను' అని తేజస్వి సూర్య ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో విలేకరుల గోష్ఠిలో చెప్పారు. వక్ఫ్‌కు చెందని భూముల ఆక్రమణకు వక్ఫ్ బోర్డు అధికారాల దుర్వినియోగం చెందకుండా ప్రభుత్వం చూసిందని ఆయన తెలిపారు. 'స్పష్టమైన టైటిళ్లు ఉన్న అన్ని సంస్థలు, ఏళ్ల తరబడి ఉనికిలో ఉన్న అన్ని ప్రార్థనా స్థలాలలో ఏ ఒక్కదానికీ కొత్త వక్ఫ్ చట్టం గురించి భయం ఉండరాదు' అని సూర్య అన్నారు. ముస్లింలను తప్పుదారి పట్టించే యత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు, 'అటువంటి భూముల్లో ఒక్క అంగుళం పరాధీనం కాదు' అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాలపై సూర్య విరుచుకుపడుతూ, సెక్యులర్ పార్టీలుగా చెప్పుకుంటున్నవి ముస్లింల కోసం ఏమీ చేయలేదని, అవి వారిని బెదరగొట్టే, తప్పుదారి పట్టించే యత్నాలే చేశాయని ఆరోపించారు. 'వక్ఫ్ బోర్డులను మరింత పటిష్ఠం చేయడమే ప్రభుత్వ ఉద్దేశం' అని సూర్య చెప్పారు.

## మాజీ కేంద్ర మంత్రి దేవేంద్ర ప్రధాన్ కన్నుమూత



బిజెపి నేత, మాజీ కేంద్ర మంత్రి దేవేంద్ర ప్రధాన్(84) సోమవారం కన్నుమూశారు. ఆయన అటల్ బిహారీ వాజ్‌పేయి హయాం ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఆయన మూడుసార్లు ఒడిశా బిజెపి అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రధాన్‌కు ఇద్దరు కుమారులు. న్యూఢిల్లీలోని తీన్‌మూర్తి వీధిలోని తన కుమారుడి అధికార నివాసంలో ఆయన చివరి శ్వాసను వదిలారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలిపారు. కాగా ప్రధాని నరేంద్ర మోడీ, దేవేంద్ర ప్రధాన్ మృతదేహానికి పుష్పాంజలి ఘటించి, ఆయన ఒడిశాలో బిజెపి బలపడ్డానికి ఎంతో కృషిచేశారని కీర్తించారు. అంతేకాక ఆయన ఎంపీగా బాగా కృషి చేసేవారని, దారిద్ర్య నిర్మూలనకు, సామాజిక స్వాధికారతకు పాటుపడ్డారని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతున్నాను అంటూ ఎక్స్ పోస్ట్ పెట్టారు. తీన్‌మూర్తి లేన్‌లోని ఆయన నివాసానికి అనేక మంది కేంద్ర మంత్రులు వెళ్లి నివాళులర్పించారు. దేవేంద్ర ప్రధాన్ 1998 లోక్‌సభ ఎన్నికల్లో దేవ్‌గఢ్ నుంచి తొలిసారి ఎన్నికయ్యారు. 1999 నుంచి 2001 వరకు కేంద్ర రవాణ, వ్యవసాయ శాఖ మంత్రిగా ఆయన పనిచేశారు. ఒడిశా ప్రగతికి ఆయన ఎంతో పాటుపడ్డారని గవర్నర్ హరిబాబు కంభంపాటి కీర్తించారు. ఆయన మృతదేహాన్ని సాయంత్రం ఢిల్లీ నుంచి భువనేశ్వర్‌కు తీసుకొస్తారని కుటుంబసభ్యులు తెలిపారు.

## మళ్లీ మారుతీ సుజుకీ ధరల పెంపు

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి మరోమారు తమ వాహన ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి తమ వాహన ధరలను 4 శాతం వరకు పెంచాలని నిర్ణయించినట్లు ఆ కంపెనీ సోమవారం రెగ్యూలేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీంతో గత రెండు నెలల్లో ఇది రెండోసారి పెంపు కావడం గమనార్హం. తయారీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ వ్యయాల భారాన్ని కొంతభాగం వినియోగదారులకు బదిలీ చేయడం మినహా వేరే మార్గం లేదని ఆ కంపెనీ పేర్కొంది. ఈ కంపెనీ ప్రాథమిక మోడల్ అల్టో కె-10 నుంచి ఇన్విక్టో మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరల శ్రేణీ రూ.4 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు ఉంది. ఇంతక్రితం మోడళ్లను బట్టి గరిష్ఠంగా రూ.32,500 వరకు పెంచేసింది. తాజా పెంపునతో కొనుగోలుదారులపై మరింత భారం పడనుంది.

## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో నకిలీ ఉత్పత్తులు

ఇ-కామర్స్ సంస్థల్లో నకిలీ ఉత్పత్తులు, ప్రామాణికత లేని ఉత్పత్తులపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ఎట్టకేలకు దృష్టి పెట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజ ఆన్‌లైన్ విక్రేతలకు చెందిన గిడ్డంగులపై బిఐఎస్ దాడులు చేసి వేలాది ధృవీకరించని ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మార్చి 7న లక్నో, గురుగావ్, ఢిల్లీలోని ఇ-కామర్స్ గిడ్డంగులపై బిఐఎస్ దాడులు నిర్వహించింది. లక్నోలోని అమెజాన్ గిడ్డంగి నుండి 215 బొమ్మలు, 24 హ్యాండ్ బ్లెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని బిఐఎస్ సర్టిఫికేషన్ లేకుండా విక్రయిస్తున్నారు. ఫిబ్రవరి 2025లో గురుగావ్‌లోని అమెజాన్ గిడ్డంగిపై జరిగిన దాడిలో 58 అల్యూమినియం ఫాయిల్స్, 34 మెటాలిక్ వాటర్ బాటిళ్లు, 25 బొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పివిసి కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లిప్‌కార్ట్ గురుగావ్ గిడ్డంగిలో జరిపిన సోదాల్లో సర్టిఫికెట్లు లేని 534 స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు, 134 బొమ్మలు, 41 స్పీకర్లు స్వాధీనం చేసుకున్నారు. బిఐఎస్ గుర్తింపు లేని ఉత్పత్తులను ఆయా సంస్థల్లో నిరంతరం విక్రయించడంపై ఫిర్యాదులు అందిస్తోన్న నేపథ్యంలో సోదాలు చేసినట్లు సమాచారం.

## నాలుగు నిషేధిత సంస్థల సభ్యుల అరెస్ట్

**ఇంఫాల్:** మణిపూర్‌లో గడిచిన 24 గంటల్లో నిషేధిత సంస్థలకు చెందిన నలుగురు ఉన్నత స్థాయి అధికారులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఇంఫాల్ వెస్ట్ మరియు బిష్ణుపూర్ జిల్లాల నుండి వారిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని లాంగోల్ గేమ్ విలేజ్ జోన్ 11 నుండి నిషేధిత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన లౌరెంబమ్ బ్రోజెన్ సింగ్ (50)ని అరెస్ట్ చేసినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అదే జిల్లా నుండి నిషేధిత ప్రేపాక్ /ఉప్ఫ్ సభ్యుడు రోమియో సింగ్, కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (పిబ్ల్యుజి) కేడర్ లైష్రామ్ టోంబాలను అరెస్ట్ చేశామని అన్నారు. బిష్ణుపూర్ జిల్లా నుండి పిడబ్ల్యుజి మరో కేడర్ ఖుంద్రక్‌పామ్ మైఖేల్‌లను అరెస్ట్ చేశామని అన్నారు. ఒక 9 ఎంఎం పిస్టల్, ఒక ఖాళీ మేగజైన్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి వద్ద భద్రత పెంపు



ఛత్రపతి శంభాజీనగర్: మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని కూల్చేయాలని కొందరు డిమాండ్ చేస్తుండడంతో పోలీసులు, అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. మహారాష్ట్రలోని శంభాజీనగర్ జిల్లా ఖుల్దాబాద్‌లో ఉన్న ఔరంగజేబు సమాధి వద్దకు వెళ్లే సందర్శకులపై ఆంక్షలు విధించారు. ఇకపైన అక్కడికి ఎవరైనా వెళితే రిజిస్టర్‌లో సంతకం చేయడంతో పాటు, ఐడి కార్డును చూపించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద విహెచ్‌పి కార్యకర్తలు నిరసనలు చేపట్టి, ఔరంగజేబు సమాధిని నిర్మూలించాలంటూ మెమోరాండంలు సమర్పించారు. ఔరంగజేబు రాజ్యవిస్తరణను మరాఠులు గట్టిగా అడ్డుకున్నారన్నది ఇక్కడ గమనార్హం. ఇదిలావుండగా ఖుల్దాబాద్‌కు వెళ్లే దారిలో అనేక చోట్ల సెక్యూరిటీ పోస్ట్‌లను ఛత్రపతి శంభాజీనగర్ రూరల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటుచేసింది. సమాధి, తదితర ప్రాంతాల్లో 50 మంది సిఆర్‌పి, 30 మంది స్థానిక పోలీసులు, 20 హోంగార్డులను మోహరించారు. సమాధిని సందర్శించే పర్యాటకులు రిజిష్టరులో తమ పేరు వివరాలు రాయడమేకాక, ఐడి కార్డును చూయించాల్సి ఉంటుంది. కాగా 'ఇక్కడ వాతావరణం ప్రశాంతంగానే ఉంది. ప్రజలు వదంతులను నమ్మకూడదు. ఔరంగజేబు సమాధిని నిర్మూలించాలని డిమాండ్ మొదలయినప్పటి నుంచి పర్యాటకుల సందర్శన సంఖ్య ఇంకా బాగా పెరిగింది' అని సమాధి కేర్‌టేకర్ పర్వేజ్ కబీర్ అహ్మద్ తెలిపారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే 'మతమార్పిడికి అంగీకరించకపోవడంతో ఔరంగజేబు సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ ఇద్దరు కుమారులను చంపించాడు, మరాఠా యోధుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను చిత్ర హింసలు పెట్టి చంపాడు. అంతేకాక కాశీ, మథుర, సోమ్‌నాథ్‌లోని అనేక మందిరాలను కూల్చేశాడు' అంటూ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సమర్పించిన మెమోరాండంలో విహెచ్‌పి పేర్కొంది. 'ఔరంగజేబుకు సంబంధించిన ఎలాంటి చిహ్నం అయినా బాధాకరమే' అని కూడా పేర్కొంది.

## తోబుట్టువులు, బంధువులు అంతా 'బహుజన్ సమాజ్' భాగస్తులే



లక్నో: తన తోబుట్టువులు, బంధువులు అంతా 'బహుజన్ సమాజ్ 'భాగస్తులేనని ఆ పార్టీ చీఫ్ మాయావతి సోమవారం అన్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ 'ఎవరైనా సరే బహుజన్ సమాజ్(బిఎస్‌పి) కోసం పనిచేస్తే వారిని ప్రమోట్ చేస్తాను, ఇందులో బంధుత్వం ఏదీ అడ్డు రాదు' అన్నారు. 'నేను బతికి ఉన్నంత వరకు పార్టీని తోబుట్టువులు, బంధువులు బలహీనపరచడాన్ని ఆమోదించను. నా తోబుట్టువులు, బంధువులు కేవలం పార్టీ భాగస్తులే. ఆమె తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ అన్ని పదవుల నుంచి తప్పించడంతో, ఆమె తాజా వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. దేశవ్యాప్తంగా బిఎస్‌పి వ్యవహారాలు చూసుకునేందుకు మాయావతి తన సోదరుడు ఆనంద్ కుమార్, రామ్జీ గౌతమ్‌లను జాతీయ కోఆర్డినేటర్లుగా నియమించారు. ప్రధాని నరేంద్ర మోడీ గురించి మాట్లాడుతూ ఆమె 'ప్రధాని ఎప్పుడూ తాను పేదరికాన్ని అనుభవించానని చెప్పుకుంటారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అంతంత మాత్రమే



15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల తక్కువగా ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానంలో స్పష్టమైంది. 2021-22లో రూ.21,342.43 కోట్లు, 2022-23లో రూ.13,174.27 కోట్లు, 2023-24లో 9,640.84 కోట్లు, 2024-25లో రూ.3,989.72 కోట్లు విడుదల చేశారు. అందులో పట్టణ స్థానిక సంస్థలకు 2021-22లో రూ.956 కోట్లు కేటాయించగా, రూ.1,157.35 కోట్లు విడుదల చేశారు. 2022-23లో రూ.990 కోట్లు కేటాయించగా, రూ.735.75 కోట్లు విడుదల చేశారు. 2023-24లో రూ.1,046 కోట్లు కేటాయించగా, రూ.984.55 కోట్లు విడుదల చేశారు. 2024-25లో రూ.1,109 కోట్లు కేటాయించగా, రూ.305.05 కోట్లు విడుదల చేశారు. మొత్తం నాలుగేళ్లలో రూ.4,101 కోట్లు కేటాయిస్తే, రూ.3,182.7 కోట్లు విడుదల చేశారు. గ్రామీణ స్థానిక సంస్థలకు 2021-22లో రూ.1,939 కోట్లు కేటాయించగా, రూ.969.50 కోట్లు విడుదల చేశారు. 2022-23లో రూ.2,010 కోట్లు కేటాయించగా, రూ.948.35 కోట్లు విడుదల చేశారు. 2023-24లో రూ.2,031 కోట్లు కేటాయించగా, రూ.3,974.19 కోట్లు విడుదల చేశారు. 2024-25లో రూ.2,152 కోట్లు కేటాయించగా, రూ.2,109.97 కోట్లు విడుదల చేశారు. మొత్తం నాలుగేళ్లలో రూ.8,132 కోట్లు కేటాయిస్తే, రూ.8,002.01 కోట్లు విడుదల చేశారు.

## స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ప్రారంభం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం గడిచిన సెషన్‌లోని ముగింపుతో పోలిస్తే లాభాల్లో కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 9:19 సమయానికి నిఫ్టీ 106 పాయింట్ పెరిగి 22,612 కు చేరింది. సెన్సెక్స్ 321 పాయింట్లు పెరిగి 74,487 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్ 103.52 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 71.25 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.28 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.65 శాతం పెరిగింది. నాస్‌డాక్ 0.31 శాతం పుంజుకుంది. స్టాక్ మార్కెట్ స్థిరీకరణలో భాగంగా సోమవారం మిడ్ క్యాప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా, చిన్న షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. డాలర్ ఇండెక్స్ బలహీనత, దేశీయ ఈక్విటీ మార్కెట్లో కొనుగోళ్ల దన్నుతో డాలర్ మారకంలో రూపాయి విలువ 24 పైసలు పెరిగి 86.81 వద్ద స్థిరపడింది. డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకల నేపథ్యంలో 'బ్యాంకు ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది' అంటూ ఆర్‌బీఐ భరోసాతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు కోలుకుంది. అమెరికా మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఎస్‌అండ్‌పీ సూచీ 0.65 శాతం, నాస్‌డాక్ 0.31 శాతం, డోజోన్స్ 0.85 శాతం లాభపడ్డాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. జపాన్ నిక్కీ, హాంకాంగ్ హాంగెసెంగ్ 1 శాతం మేర లాభంతో కదలాడుతుంటే.. షాంఘై, ఆస్ట్రేలియా ఏఎస్‌ఎక్స్ మాత్రం బలహీనంగా ట్రేడవుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు మంగళవారం నికరంగా రూ.4,488 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.6,001 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు.